క్లుప్తంగా

బాక్సింగ్ విజేతలకు అభినందన


అభినందన కార్యక్రమంలో బాక్సర్లు,అతిథులు

మల్కాపురం: స్థానిక మైక్‌టైసన్ బాక్సింగ్ క్లబ్ ద్వారా శిక్షణ పొందిన పలువురు జూనియర్ బాక్సర్లు ఇటీవల గాజువాకలో నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించారు. వీరిని ఆదివారం జీవీఎంసీ 60వ వార్డు ఎంబిజీ కాలనీ మైదానంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ తదితరులు అభినందించారు. క్లబ్ అభివృద్ధికి రూ. 10 వేలు అందించారు. కార్యక్రమంలో కోచ్‌లు అలీ,గణేష్,హరిలతో పాటు జూనియర్ బాక్సర్లు పాల్గొన్నారు.

రైతు బజారులో కళాజాత


రైతు బజారులో బుర్రకథ ప్రదర్శిస్తున్న కళాకారులు


గోపాలపట్నం: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గోపాలపట్నం రైతు బజారులో ఆదివారం కళాజాత నిర్వహించారు. కళాకారులు నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడరాదని, వాటికి బదులు గుడ్డ సంచులు, నార సంచులు వాడాలని బుర్రకథ ద్వారా వివరించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాన్ని, ప్రమాదాలను వివరించారు. 120 మైక్రాన్ల మందం కంటే తక్కువ ఉన్నవి నిషేధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు వై. వెంకటేశ్వరరావు, రామలింగేశ్వరరావు, సాయి కుమార్ కళాకారులు ప్రదర్శించారు. రైతు బజారు సహాయకుడు శివ సహకారం అందించారు.

ఉక్కు ఉద్యోగులకు వేతన ఒప్పందం చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న దొమ్మేటి అప్పారావు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణం వేతన ఒప్పందం చేయాలని స్టీల్ హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు అన్నారు. ఈ నెల 3,4 తేదీల్లో మహారాష్ట్రలోని ఎన్‌యూఎస్‌ఐ ఆడిటోరియంలో స్టీల్ మెటల్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హెచ్‌ఎంఎస్ ఇండస్ట్రియల్ ఆల్ గ్లోబెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ సెయిల్ యూనిట్లలో వేతన ఒప్పందం చేశారని, ఆర్‌ఐఎన్‌ఎల్‌లో ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. షీలానగర్ వద్ద ఈఎస్‌ఐ ఆస్పత్రిని నిర్మించాలన్నారు. నిర్వాసితులకు శాశ్వత ఉద్యోగాల కల్పించాలని, ఐరన్, ఓర్, కోల్ మైన్స్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక నిధి ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎస్‌ఎంఈఎఫ్‌ఐ అధ్యక్షుడు ఎస్.త్యాగి, ప్రధాన కార్యదర్శి ఎన్‌జేసీఎస్ మెంబర్ వాడాకర్, రాజేంద్రసింగ్, శశిధర్ నాయక్, హెచ్‌ఎస్ మిశ్రా, డాక్టర్ శెట్టి శుశాంత్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

దివ్యాంగ వ్యక్తి అదృశ్యం


అప్పలరాజు

సీతమ్మధార: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి ఐదు రోజులుగా తిరిగి రాకపోవడంతో అతడి సోదరి అనూషా ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ ధర్మేంద్ర కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట కనకమ్మ వారి వీధికి చెందిన జి.అప్పలరాజు(దివ్యాంగుడు) ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇంటికి వెళ్లి వెదికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం అప్పలరాజు సోదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతడు ఎక్కడైనా కనిపిస్తే 63051 87009, 85558 13894 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ ధర్మేంద్ర కోరారు.

కాపు సామాజిక భవనానికి మోక్షం

- సంతోషం వ్యక్తం చేస్తున్న కాపు సంఘం నాయకులు
- టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి వదిలేసిన వైనం
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆనంద్‌కుమార్ చొరవతో నిధులు


పద్మనాభనగర్‌లో నిలిచిపోయిన కాపు సామాజిక భవనం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో కాపు సామాజిక భవనానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గత టీడీపీ ప్రభుత్వంలో 2019లో పనులు హడావుడిగా ప్రారంభించారు. నిధులు మంజూరు కాకపోవడంతో ప్రారంభ దశలోనే పనులు నిలిచిపోయాయి. దీంతో పునాదులకే పరిమితమైంది. అయితే ఇటీవల సమస్యను వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మాట్లాడి మళ్లీ నిధులు మంజూరు చేయించారు. కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభించనున్నారు. దీంతో కాపు నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి .. ఇక్కడ సామాజిక భవన నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ విద్యా, సంక్షేమ మౌలిక వసతుల కల్పన అభివృద్ధి సంస్థ ద్వారా 2019లో రూ. 50లక్షలు మంజూరయ్యాయి. అయితే పునాదుల స్థాయి వరకు నిర్మాణం చేశారు. రూ.12.5లక్షలు ఖర్చు చేసినా బిల్లు మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ వదిలి వెళ్లి పోయాడు. ఆ తర్వాత స్థానిక కాపు సంఘం నేతలు దీనిపై అర్జీలు పెట్టినా ప్రయోజనం లేకపోయింది. కాపు సంఘ నేతలు సామాజిక భవనం పరిస్థితిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆనంద్‌కుమార్ కృషితో...
వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ కృషితో కాపు సామాజిక భవనం పనుల్లో కదలిక రానుంది. జిల్లా వెనుకబడిన తరగతుల సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ సంస్థ ద్వారా రూ. 50 లక్షలు మంజూరు చేశారు. ఇందులో రూ.12.50 లక్షల పనులు పూర్తయ్యాయి. త్వరలో మిగిలిన పనులు ప్రారంభించనున్నారు.

ఆయన చేసిన మేలు మరువ లేం



సామాజిక భవనం మధ్యలో నిలిచిపోయిన విషయాన్ని పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన భవన నిర్మాణం అయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలా చెప్పిన కొద్దినాళ్లకే నిధులు మంజూరు చేయించారు. చాలా సంతోషంగా ఉంది. ఆయన్ను కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతాం.

– గంరెడ్డి అప్పలసత్యనారాయణ, శ్రీకృష్ణ దేవరాయ కాపు తెలగ బలిజ సేవా సంఘం అధ్యక్షుడు

వెంటనే స్పందించారు



పద్మనాభనగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆనంద్‌కుమార్‌కు ఇక్కడి కాపు భవనం పరిస్థితిని వివరించాం. స్థానిక కాపు సంఘం నేతలు ఆయనకు అర్జీ ఇచ్చారు. అంతే వెంటనే స్పందించారు. భవనాన్ని పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నారు. తక్కువ సమయంలో నిధులు మంజూరు చేయించారు. చాలా సంతోషంగా ఉంది.

–బెహరా భాస్కరరావు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు

ఆనంద్‌కుమార్‌ను పరామర్శించిన నాయకులు


ఆడారి ఆనంద్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఆదివారం పలువురు ముఖ్య నాయకులు పరామర్శించారు. కాలికి దెబ్బ తగలడంతో నగరంలోని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఆనంద్‌కుమార్‌ను టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు



దాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్ పర్యవేక్షించారు. మండుటెండలకు భక్తులు అవస్థలు పడ్డారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు ప్రత్యేక టికెట్లు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ధ్వజస్తంభ పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

ఘనంగా రైతు పూజోత్సవం


రైతులను సత్కరిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: ఏరువాక పౌర్ణమి సందర్భంగా గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు పూజోత్సవాన్ని వేపగుంట సేనాపతి కాలనీ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ విజయ దుర్గ గోఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రం వద్ద రైతులను సత్కరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రైతులు టి. సత్యనారాయణ, బొడ్డేటి అప్పారావు, ఏరువాక త్రినాథ్, కె. సంతోష్, కె. సూరిబాబు, జి. శ్రీనివాస్, పి. బాబూజీ, కె. సాంబమూర్తి, ఆర్. గౌరి నాయుడు, జి. ప్రసాద్, జగన్‌ను సత్కరించారు. దేశానికి రైతుల వెన్నుముఖగా నిలుస్తున్నారని వారిని గౌరవించాల్సి బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందని జేడీ ఫౌండేషన్ సభ్యుడు సాలాది కృష్ణయ్య అన్నారు. కార్యక్రమంలో పిన్నమనేని శ్రీనివాస్, బుద్దాల కృష్ణ మోహన్, పి. నాగేశ్వరరావు జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

బాబోయ్.. దుర్గంధం

- జీవీఎంసీ 58వ వార్డులోపారిశుధ్య సమస్య
- గెడ్డలు, కాలువలు వ్యర్థాల మయం
- ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు


పిలకవానిపాలెం గెడ్డ వద్ద నిలిచిపోయిన వ్యర్థాలు


ములగాడ వద్ద వీధి కాలువ దుస్థితి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య వేధిస్తోంది. గెడ్డలతో పాటు వీధి కాలువలు సైతం వ్యర్థాలతో పూడుకుపోయాయి. మురుగు పారే దారిలేక రోడ్లపైకి వస్తోంది. దీంతో ఆయా ప్రాంత వాసులు దుర్వాసన భరించలేక అవస్థలు పడుతున్నారు.

వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం
పారిశుధ్య కార్మికులు సకాలంలో వ్యర్థాలు తొలగించక పోవడం వల్లే తరుచూ ఈ సమస్య ఇక్కడ ఎదురవుతుందని ఆయా కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. పిలకవానిపాలెం గెడ్డలో మూడు వారాల నుంచి వ్యర్థాలు పేరుకుపోయాయి. వీటిని సకాలంలో సిబ్బంది తొలగించక పోవడంతో పందులు,వీధి కుక్కలు మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. గెడ్డలో ఉన్న వ్యర్థాలను బయటకు తీయడం.. పందులు వీధుల్లో తిరిగి ప్రజలను భయపెడుతున్నాయి.దీంతో గెడ్డకు ఆనుకుని ఉన్న నివాసీయులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఓ వైపు వ్యర్థాలు.. మరో వైపు దుర్గంధంతో పాటు పందుల బెడద ఉందని వాపోతున్నారు.

ములగాడలో..
ఇదే వార్డు ములగాడ విలేజ్ ప్రాంతంలో వీధి కాలవుల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. వీటిని సకాలంలో తొలగించక పోవడంతో ఆ పరిసరాల్లో విపరీతమైన చెడు వాసన వస్తోంది. దీంతో ఎప్పుడూ తలుపులు మూసుకుని ఉండాల్సి వస్తోందని వీధి కాలువలకు ఆనుకుని ఉన్న నివాసీయులు వాపోతున్నారు.ఇదే మాదిరిగా శ్రీహరిపురం పరిసర ప్రాంతాలతో పాటు ,గుల్లలపాలెం గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. అధికారులు స్పందించి వ్యర్థాల తొలగించాలని ఆయా ప్రాంత వాసులు కోరుతున్నారు.

అణగదొక్కే ప్రయత్నం మానుకోవాలి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కును అణగదొక్కే ప్రయత్నాలు కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 843వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని కేంద్రం ఉపసంహరించుకున్నట్లు ప్రకటన చేయాలని, లేని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి అమలు కావడానికి ముడిసరకుల నిల్వలు పెంచాలని, కార్మిక వర్గానికి నూతన వేతన సవరణ ప్రకారం జీతాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలు, ఇతర కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించి, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ పండగ చాటింపు


చాటింపు వేస్తున్న అమ్మవారి సేవకుడు

సింహాచలం: అడవివరం గ్రామదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి పైడితల్లి అమ్మవారి పండగ ఈనెల 13న నిర్వహించనున్నారు. గ్రామ సంప్రదాయం ప్రకారం ఆదివారం సాయంత్రం చాటింపు వేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అల్లిపురం : రౌడీ షీటర్లు శాంతి, భద్రతలకు భంగం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు పీడీ యాక్ట్ అమలు చేసి నగర బహిష్కరణ విధిస్తామని పోలీసులు హెచ్చరించారు. నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ ఆదేశాల మేరకు ఆదివారం నగరంలో అన్ని పోలీస్ స్టేషన్లలో ఏసీపీలు, సీఐలు ఆయా స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లు, సస్పెక్టులు, పాత నేరస్తులను స్టేషన్లకు పిలిపించారు. వారి ప్రవర్తనపై ఆరా తీసి, ఏం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. చెడు అలవాట్లు విడనాడి, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్ వెంకన్న ఆలయంలో గిరి ప్రదక్షిణ


ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గిరి ప్రదక్షిణ జరిగింది. పౌర్ణమి సందర్భంగా ఉదయం ఆరు గంటలకు ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు,చిన్నారులు

మల్కాపురం: ఆదర్శనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని..విద్యార్థి దశలోనే అంబేడ్కర్ గురించి నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. స్వేచ్ఛ,సమానత్వం,న్యాయం మొదలైన విషయాలను ప్రతి విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. ప్రతి మనిషిని గౌరవంతో సమానంగా ఆదరించాలన్నారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లయ్యరాజు మాట్లాడుతూ గొప్ప పుస్తకాలను పఠించటం వల్ల చిన్నారులకు మంచి విజ్ఞానం కలుగుతుందన్నారు. పలువురిలో ఎలా మసులు కోవాలి.. పది మందికి ఏ విధంగా సాయం అందించగలమో తెలుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జీవిత చరిత్రపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో రచయిత సత్తిరాజు,కార్మిక సంఘ నాయకుడు బి.సత్యానందం, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింధియా: కళలపై ఉన్న ప్రేమతో కళాకారులు ఇంకా సేవ అందిస్తున్నారని, అటువంటి మరుగున పడిన కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని లలితకళామందిరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంజయంతిని పురస్కరించుకుని లయమాధురి ఆర్కెస్ట్రాను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణబాబు, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాన గాంధర్వుడు స్వర్గీయ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం కళాకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళలను, కళాకారులను గౌరవించి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆర్కెస్ట్రా ఆహుతులు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రోగ్రాం స్పాన్సర్ (జీఆర్‌కే)రవికుమార్, నాయకులు సాలాపు రామారావు, నిర్వాహకులు రౌతు బాబు, సూరాడ జోగారావు, ఆర్. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు


ఆలయ ప్రాంగణంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బెహరా విజయ చైతన్య, ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: గోపాలపట్నం ఇందిరానగర్, లక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మోదకొండమ్మ అమ్మవారి మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ ప్రాంగణంలో ఆదివారం బెహరా విద్యాసంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య, స్థానిక నాయకుడు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా ఖ్యాతి గాంచిన అమ్మవారు మోద కొండమ్మ అమ్మవారని తెలిపారు. వైభవంగా నిర్వహించనున్న పండగకు భక్తులందరూ సహకరించాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు విల్లూరి ప్రకాష్, కోనేటి నూకరాజు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 20 వరకు పండగ జరుగుతుందని తెలిపారు.18న పుట్టబంగారం తీత, 19న తొలేళ్ల పండగ, సారె ఊరేగింపు, 20న ప్రధాన పండగ జరుగుతుందని చెప్పారు. అందుకు తగిన విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జులై 18న నెల పండగ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆరోజు భారీ అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కృష్ణ, సత్తిరాజు, అప్పలస్వామి, దొడ్డి రాము, కుమార్, గణేష్, ఇమంది శ్రీను, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్ పరిధిలోని న్యూకోచింగ్ కాంప్లెక్స్ దగ్గరలో రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న గవర్నమెంట్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు సూచనల మేరకు ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు గల వ్యక్తి గుర్తుతెలియని రైలు నుంచి జారిపడడం వల్ల గానీ, లేదా ట్రాక్ దాటే సమయంలో రైలు ఢీకొట్టడం వల్ల గానీ మరణించి ఉండొచ్చు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి వైట్ అండ్ ఆరెంజ్ కలర్ టీ షర్ట్ ధరించి ఉన్నాడని, టీ షర్ట్ వెనుక విహాన్ స్ప్రెడ్ ద లైట్ అనే పేర్లు ఉన్నాయని, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. ఈ వ్యక్తి గురించి సమాచారం తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ సిబ్బందికి స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో గానీ తెలియజేయాలని కోరారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలుకు నివాళి


బాలసుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ జీఎస్ఎన్ రాజు, రాజశేఖర్

మర్రిపాలెం: మెలోడి క్రియేటర్స్, కాలనీ కేర్ టీం సంయుక్తంగా ఆదివారం మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వన విహార్ పార్కులో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు విగ్రహానికి ముఖ్య అతిథి సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు చలనచిత్ర సీమ ద్వారా తన మధుర గానంతో బాలు చేసిన గాత్ర సేవలను వీసీ రాజు కొనియాడారు. దేశం గర్వించే గొప్ప గాయకుడు కీర్తిని పొందడమే కాకుండా తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ కదలి సారథ్యం వహించిన ఈ కార్యక్రమంలో మెలోడి క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కొణతాల రాజు, పుండరీ కుమార్, ప్రభాకర్, మధవ్, భూపతి నాగేశ్వరరావు, ఎస్ఎస్ఎన్ రాజు, కాలనీ కేర్ టీం సభ్యులు, కళాభిమానులు పాల్గొన్నారు.

ఎస్పీబీ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో..
ఎస్పీబీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వన విహార్ పార్కులో ఎస్పీ బాలు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శర్మ ఆప్టికల్స్ అద్దంకి వాసు, కబడ్డీ శ్రీను, వెంకీ, వి.శ్రీను, సాయి, శంకర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా వెంకన్నకు జ్యేష్ఠాభిషేకం


వెంకన్నకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: జ్యేష్ఠ పౌర్ణమి పురస్కరించుకుని వెంకటాద్రిపై వెంకటేశ్వరస్వామికి జ్యేష్ఠాభిషేకం ఘనంగా నిర్వహించారు. 1008 నారికేల జలాలతో స్వామికి అభిషేకం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు పూజలు నిర్వహించారు.